క్లుప్తంగా

ఆలయాల్లో పూజలు


వేంకటేశ్వరస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు చేపట్టారు. కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయ స్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కౌతాళంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధికంగా తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలను చేపట్టారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. డ్రైనేజీల్లో పేరుకుని పోయిన చెత్తచెదారాన్ని తొలగిస్తున్నట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. గ్రామంలోని అన్ని వీధుల్లో చెత్తచెదారం లేకుండా పనులు చేపట్టామని, ప్రజలు చెత్తను చెత్త బండిలోనే వేయాలని సూచించారు.

భక్తులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు


కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీస్ మహిళా కానిస్టేబుల్ నిర్మలమ్మ

మంత్రాలయం : మంత్రాలయం శ్రీ మఠం పరిసర ప్రాంతాల్లో రాఘవేంద్ర స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తాలకు గందము బొట్టు పెడతామని, దానం చేయండంటూ ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రాలయం మహిళా కానిస్టేబుల్ నిర్మలమ్మ హెచ్చరించారు. శనివారం స్థానిక మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో మంత్రాలయం ఆలయ పరిసరాలలో యాచిస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ భక్తులను ఇబ్బంది పెట్టే విధంగా ప్రవర్తిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

పరదేశప్పతాత ఆరాధన మహోత్సవానికి ఆహ్వానం


మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ ధర్మకర్తలు, పెద్దల

ఆదోని టౌన్: మండలంలోని అట్టేకల్ గ్రామంలో ఈనెల 31వ తేదీన జరిగే శ్రీశ్రీశ్రీ అవధూత పరదేశప్పతాత 15వ పుణ్యారాధన మహోత్సవ కార్యక్రమానికి ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని ఆలయ ధర్మకర్తలు, పెద్దలు శనివారం ఆహ్వానించారు. ఆరాధన మహోత్సవ కార్యక్రమానికి రూ.5 వేలను మాజీ ఎమ్మెల్యే విరాళంగా అందించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పుణ్యారాధన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.

సబ్‌జైలు తనిఖీ


జైలులోని రికార్డులను తనిఖీ చేస్తున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: పట్టణంలోని సబ్‌జైలును రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జిల్లా రెండవ అదనపు జడ్జి పి.జె.సుధ తనిఖీ చేశారు. సబ్‌జైలులోని రికార్డులు, వంట గదులు, జైలు గదులను తనిఖీ చేశారు. జడ్జి మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. ఖైదీలతో మాట్లాడడానికి వచ్చే వారికి మాట్లాడే సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నజీర్ అహ్మద్, జైలు విజిటింగ్ న్యాయవాది ఆనంద్, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశపరిచిన డీఎస్సీ

- ఆదోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత
- 1,750 మంది విద్యార్థులు
- 55 మందికి గాను 18 మంది టీచర్లు
- డీఎస్సీలో కొత్త ఉపాధ్యాయులు వస్తారని ఆశించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు
- ఒక్కరినీ కేటాయించని వైనం
- కుంటుపడుతున్న విద్యాబోధన


ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

ఆదోని సెంట్రల్: గతంలో కన్నా మెరుగైన విద్యాబోధన అందిస్తామని.. డీఎస్సీ ప్రకటన చేసి ఉపాధ్యాయులను నియమిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటనలు గుప్పించింది. దీంతో డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త ఉపాధ్యాయులు వస్తారు.. మాకు పని భారం తగ్గుతుందని.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించవచ్చని ఉపాధ్యాయులు ఆశించారు. పలు పాఠశాలకు ఒక్కరిని కూడా నియమించకపోవడంతో నిరాశే మిగిలింది.

ఒక్కో తరగతికి నాలుగు సెక్షన్లు

ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 1,750 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 55 మంది ఉపాధ్యాయులు ఉండాలి. అయితే 18 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఇంకా 37 మంది ఉపాధ్యాయులు అవసరం ఉంది. 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఒక్కొక్క తరగతిని 4 సెక్షన్లుగా విభాగించారు. 6వ తరగతిని 3 సెక్షన్లుగా విభజించారు. ఒక్కో సెక్షన్‌లో దాదాపు 100 నుంచి 120 మంది విద్యార్థులు దాకా ఉంటారు. కనీసం క్లబ్ చేసుకొని విద్యను అందించడానికి కూడా కుదరని పరిస్థితి. పరీక్షల సమయానికల్లా సిలబస్ పూర్తి చేయాలి. మధ్యలో ఎఫ్ఎ-1, ఎఫ్-2 వంటి పరీక్షలను నిర్వహించాల్సి ఉంటుంది. దీనికితోడు ఆన్‌లైన్ అటెండెన్స్, పరీక్షల నిర్వహణ అనంతరం మార్కులను ఆన్‌లైన్లో ఎక్కించడం, మధ్యాహ్న భోజనం పర్యవేక్షించడం వంటి పనులు ఉంటున్నాయి. ఈ పనులను ఎప్పుడు కంప్లీట్ చేయాలి, సిలబస్ ఎప్పుడు పూర్తి చేయాలో తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

ఉపాధ్యాయులకు నిరాశ..

పాఠశాలలో సబ్జెక్టుకు కనీసం నలుగురు లేదా ఐదు మంది ఉపాధ్యాయులు ఉండాలి. ఇంగ్లిషు సబ్జెక్టుకు-1, సోషల్ సబ్జెక్టుకు-1 ఫిజికల్ సబ్జెక్టుకు-2 బయాలజీ సబ్జెక్టుకు-2, మ్యాథమెటిక్స్‌కు-5 మంది, హిందీ సబ్జెక్టుకు-3, తెలుగు సబ్జెక్టుకు-3 ఉపాధ్యాయులు ఉన్నారు. ఇంగ్లిషు, సోషల్, ఫిజికల్ సైన్స్, బయాలజీ సబ్జెక్టులకు ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండడంతో ఉన్న ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. 55 మంది ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట 18 మంది మాత్రమే ఉన్నారు. డీఎస్సీలోనైనా కొత్త ఉపాధ్యాయులు పాఠశాలకు వస్తారని ఆశించారు. అయితే కొత్త ఉపాధ్యాయులు ఎవరు రాక పోవడంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను నిరాశపరిచింది.

అవసరం కన్నా తక్కువ నియామకం

ఆదోని పట్టణ, గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. అయా పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉన్న ఉపాధ్యాయులతో పాటు అదనంగా తెలుగు ఎస్‌జీటీలు 250 మంది, స్కూల్ అసిస్టెంట్లు 188 మంది అవసరమని విద్యాశాఖ అధికారులు లెక్కలు తేల్చారు. అయితే తెలుగు ఎస్‌జీటీలు 82 మంది, కన్నడ మీడియంకు 1, ఉర్దూ మీడియంకు 5 మంది ఉపాధ్యాయులు వచ్చారు. ఇంకా ఎస్‌జీటీలు 168 మంది స్కూల్ అసిస్టెంట్లు 166 మంది ఉపాధ్యాయులు అవసరం ఉంది. మిగిలిన పోస్టులు ఎప్పుడు భర్తీ అవుతాయో, ఎప్పుడు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతుందో తెలియని పరిస్థితి.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది

డీఎస్సీ ద్వారా పాఠశాలకు కొత్త ఉపాధ్యాయులు వస్తారని ఆశించాం. అయితే ఎవరూ రాలేదు. ఇంగ్లిషు, సోషల్, ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారు. సెక్షన్లు ఏమో ఎక్కువగా ఉన్నాయి. ప్రతి విద్యార్థికి న్యాయం చేయడం కష్ట తరంగా ఉంది. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించలేక పోతున్నాం. పాఠశాలలో చదువుకునే విద్యార్థులంతా పేద వారే కనుక అధికారులు, పాలకులు స్పందించి ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను నియమిస్తే బాగుంటుంది. – **శ్రీనివాసులు, ఇంగ్లిషు ఉపాధ్యాయుడు**

ఇబ్బంది పడుతున్నాం

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండాలి. అయితే ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నాం. ప్రతి ఉపాధ్యాయుడు ఒక్కో సెక్షన్‌కు వెళ్లి ఆన్‌లైన్ అటెండెన్స్ వేయాల్సి ఉంటుంది. ఒక్కో సెక్షన్లో ఆన్‌లైన్ అటెండెన్స్ వేసేందుకు 10, 15 నిమిషాలు పడుతుంది. దీంతో సమయం వృథా అయిపోతుంది. దీనికి తోడు విద్యార్థులు పరీక్షలో సాధించిన మార్కులను ఆన్‌లైన్లో ఎక్కించాల్సి ఉంటుంది. ఇలా ప్రతిపనిని ఆన్‌లైన్లో చేయడం వలన ఇబ్బందులకు గురవుతున్నాం. పని ఒత్తిడితో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించలేక పోతున్నాం.
– **రమాదేవి, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు**

అధికారులకు విన్నవించాం

డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో జాయిన్ అయ్యారు. ఎస్‌జీటీ తెలుగు ఉపాధ్యాయులు 82, కన్నడ 1, ఉర్దూ మీడియంలో 5 , స్కూల్ అసిస్టెంట్లు 22 మంది నియమితులయ్యారు. పురపాలక పరిధిలో, గ్రామీణ ప్రాంతంలోని పలు పాఠశాలలకు ఉపాధ్యాయులు వచ్చారు. కేటగిరీ-2 కింద ఉన్న పాఠశాలలకు మాత్రం ఉపాధ్యాయులను నియమించలేదు. ఎప్పుడు నియమిస్తారో తెలియదు. కేటగిరీ-2లో ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలను గుర్తించి అధికారులకు విన్నవిస్తాం.
– **భూపాల్ రెడ్డి, మండల విద్యాధికారి-1 ఆదోని**

పత్తి, వేరుశనగ కొనుగోలు చేయాలి


వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆదోని రూరల్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో సీసీఐ, మార్క్‌ఫెడ్ ద్వారా తక్షణమే పత్తి, వేరుశనగ పంటలను కొనుగోలు చేసి కనీస మద్దతు ధర అమలయ్యేలా చూడాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, ఉపాధ్యక్షులు కె.మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మార్కెట్‌యార్డులో రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి పత్తి పంటను సీసీఐ కొనుగోలు చేయాలని మార్కెటింగ్ జేడీ రామాంజనేయులు పత్రికా ప్రకటనలో తెలియజేసినప్పటికీ రైతు భరోసా కేంద్రాల్లో నేటి వరకు రైతుల పేర్లు నమోదు చేసుకోవడం లేదన్నారు. దీంతో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని రైతులు సహాయ కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే మార్కెట్‌యార్డులో కానీ పరిశ్రమలలో కానీ రూ.4 వేల నుంచి రూ.7 వేలు లోపు ధర పలుకుతుందన్నారు. అలాగే రోజురోజుకీ ధరలు పతనమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఈరన్న, హనుమంతు, రైతులు పాల్గొన్నారు.

తెల్లకుసుమల సాగుతో అధిక లాభాలు


మాట్లాడుతున్న ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి

ఎమ్మిగనూరురూరల్: తెల్లకుసుమ పంట సాగుతో అధిక లాభాలు పొందవచ్చని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఐసీఏఆర్-ఐఐఏఆర్ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సురేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక, భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ, బనవాసి కేవీకేల ఆధ్వర్యంలో తెల్ల కుసుమ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తెల్ల కుసుమల పంట తక్కువ వర్షపాతం ప్రాంతాలకు అనుకూలమని, నూనె శాతం అధికంగా ఉండటం వలన రైతులకు అదనపు ఆదాయ వనరుగా మారుతుందని చెప్పారు. కుసుమల పంట సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలని సూచించారు.

మొక్కుబడిగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర

గోనెగండ్ల : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని మండల కేంద్రం గోనెగండ్లలో శనివారం అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆదోని డీఎల్‌పీఓ తిమ్మక్క హాజరయ్యారు. దీంతో అధికారులు స్థానిక నేతలను పిలిపించి స్వర్ణంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నట్లు బ్యానర్ ముందు ఫొటోకు ఫోజు ఇచ్చి కార్యక్రమాన్ని మొక్కుబడిగా జరిపించేశారు. కార్యక్రమాన్ని ప్రతినెలా మూడో శనివారంను అధికారులు మండలంలో ఇలాగే కానిచ్చేసిస్తుండటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్వచ్ఛతకు సహకరించాలి



బ్యానర్ పట్టుకొని ఫోటో దిగుతున్న అధికారులు

ఎమ్మిగనూరుటౌన్/కోసిగి/నందవరం : పట్టణంలో స్వచ్ఛతకు పట్టణ వాసులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కోరారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ర్యాలీని ప్రారంభించారు. కోసిగిలో ఎంపీడీఓ ఈశ్వరయ్య స్వామి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం నుంచి బాలికల పాఠశాల విద్యార్థినులచే ర్యాలీ నిర్వహించారు. నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మైదానంలో ఇండోఫిల్ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

హిందువులు ఐక్యత చాటాలి


విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దల్ సభ్యులతో కోనేరు నాగేంద్రప్రసాద్

నందవరం: హిందులందరూ ఐక్యతను చాటుకోవాలని ఎమ్మిగనూరు మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విశ్వహిందు పరిషత్, బజరంగదళ్ సభ్యుల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. హిందులంత ఏకమై ఐక్యతను, తమ విలువలను కాపాడుకోవాలని, ఐక్యత కూడా క్రమశిక్షణతో కూడుకున్నదై ఉండాలన్నారు. గ్రామాల్లో హిందూ యువకులంతా సంఘటిత వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సనాతన ధర్మం పాటించాలని సూచించారు. ఇటీవల ఎమ్మిగనూరులో గణేష్ నిమజ్జనం ఉత్సవాలలో సీఐ శ్రీనివాసులు నిర్వహకులపై బూటు కాలుతో తన్నడంపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. సీఐపై చర్యలు తీసుకునేంతవరకు తమ న్యాయపోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆదోని జిల్లా ప్రచార ప్రసార ప్రముఖ ఉపేంద్రరెడ్డి, మంత్రాలయం ప్రఖండ అధ్యక్షుడు శ్రీవర్ధన్‌గౌడ్, ప్రఖండ జగదీష్, సభ్యులు గోవర్ధన్ నాయుడు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 21ని రద్దు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఆటో కార్మికులకు ఇబ్బంది కలిగించే జీఓ నెంబర్ 21ను వెంటనే రద్దు చేసి ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్ వద్ద ఆటో స్టాండ్‌లో ఆటో కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వాహన మిత్ర పేరిట సవాలక్ష నిబంధనలు పెట్టి కొందరు ఆటో డ్రైవర్లకు మాత్రమే రూ.15వేలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండు విడతల వాహన మిత్ర పథకం ఎగ్గొట్టిందని విమర్శించారు. నాయకులు నబిరసూల్, బాబు, రాఘవ, వెంకటేశ్వర్లు, స్వామి, బాషా తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతు కుటుంబానికి పరామర్శ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 29వ వార్డులో అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు రాఘవేంద్ర భౌతిక కాయానికి శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ పామయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వార్డు నాయకులు నరసింహులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

నందవరం : మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నింబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, వాటిపై ఉన్నాతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్‌ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆర్‌పీవీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాసులుకి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ..మండలంలోని సరస్వతి, రెయిన్ బో, జీనియస్ పబ్లిక్ స్కూళ్లలో విద్యార్థులకు సరైన వసతులు లేవని, రేకుల షేడ్లు, మధ్యాహ్న భోజనానికి విద్యార్థులు కుర్చోవాడానికి వసతులు కరువయయ్యాన్నారు. స్కూల్ బస్సులు ఫీట్‌నేస్ లేవని, ఆటోలో అధిక సంఖ్యలో విద్యార్థులను తరలిస్తున్నారని, ఎదైనా ప్రమాదం జరిగేతే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. మండలంలోని ప్రైవేట్ పాఠశాలలను ఉన్నాతాధికారులు తనిఖీ చేసి అధిక ఫీజులు, వసతులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌పీవీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీమేష్, డివిజన్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం ఎదుట విద్యుత్ సంస్థ యాజమాన్యంతో జేఏసీ ఒప్పందం చేసుకున్న పత్రాలను సీఐటీయూ కార్యదర్శి గోవిందుతో కలిసి దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్ కార్మికులు ఏళ్ల తరబడి డైరెక్ట్ పేమెంట్ రెగ్యులరైజేషన్ విషయాన్ని తేల్చకుండా యాజమాన్యం జేఏసీ నాయకులతో లోపాయికార ఒప్పందం కుదుర్చుకోవడం సమంజసం కాదన్నారు. దీంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నాగన్న, యూనుస్ బాషా, పోతప్ప, దేవేంద్రరెడ్డి, సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

ఆదోని అర్బన్: పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో కాపు బలిజ యువకుడు తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు దారుణ హత్యపై బలిజ సంక్షేమ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆదోని బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్, న్యాయవాది లోకేష్‌కుమార్‌లు సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందించారు.బండి బసవరాజు, మెట్ల రాధాకృష్ణన్, సిద్దప్ప, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


జర్నలిస్టులపై అక్రమ కేసులు, వేధింపులు ఆపాలని కోరుతూ ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఎమ్మెల్యే సొంత నిధులతో బోరు ఏర్పాటు


తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఉరుకుంద ఆర్చ్ సమీపంలో విశ్వబ్రాహ్మణ కుల బాంధవుల ఆరాధ్య దైవం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి సొంత నిధులతో తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. విశ్వబ్రాహ్మణ కుల బాంధవులు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని కలిసి తమ వంతుగా ఆలయానికి బోరును వేయించాలని కోరారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారు. శనివారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి గ్రామానికి చేరుకుని ఆ కుల బాంధవులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి బోరు డ్రిల్లింగ్‌ను ప్రారంభించారు. 250 అడుగులలో రెండు ఇంచుల నీళ్లు పుష్కలంగా పడ్డాయి. దీంతో ఆ కులబాంధవులు ఎమ్మెల్యేవై.బాలనాగిరెడ్డికు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మురళీ మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ మండల నాయకులు నాడుగేని నాగరాజు, మహంతేష్ స్వామి, బసిరెడ్డి, కాంట్రాక్టర్ నాగరాజు, మంగమ్మ, కట్టెల నరసింహులు, ఆంజనేయులు, ప్రతాప్, అయ్యప్ప, కాల్వ లక్ష్మయ్య, నేల కోసిగి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు కోటి సంతకాల సేకరణ

మండలకేంద్రం కోసిగిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో మెడికల్ కళాశాలలకు ప్రైవేటీకరణకు నిరసనగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఎల్లమ్మ ఆలయ మైదానానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు, అత్యధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

టపాసుల విక్రయానికి అనుమతి తప్పనిసరి


మాట్లాడుతున్న తహసీల్దార్ శేషఫణి

ఎమ్మిగనూరురూరల్: దీపావళి పండగను పురస్కరించుకొని దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ శేషఫణి, ఫైర్ అధికారి రామాంజనేయులు, విద్యుత్ ఏఈ ప్రసన్న ఆంజనేయులు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టపాసుల అంగళ్లు ఏర్పాటు చేసుకునే వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని వైడబ్ల్యూఎస్ మైదానంలో టపాసుల విక్రయ అంగళ్లకు తప్పనిసరిగా పోలీస్, ఫైర్, ఇతర అధికారుల అనుమతులు తీసుకోవాలని, అనుమతి తీసుకోకుండా ఏర్పాటు చేసుకుంటే తొలగిస్తామని హెచ్చరించారు. దుకాణం, దుకాణానికి మధ్య దూరం ఉండాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ వీర భద్రగౌడ్, ఆర్ఐ సాహిద్, వీఆర్వో బసవరాజు, ఏఎస్ఐ కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కేటాయించండి

పెద్దకడబూరు : 'మా పాఠశాలకు సింగిల్ టీచర్ ఉండడంతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని, అదనంగా ఉపాధ్యాయులను కేటాయించాలని' కంబలదిన్ని ఎస్సీ కాలనీ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు శనివారం ఎంఈఓ ఉస్మాన్‌బాషాకు వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయాన్ని చేరుకొని ఏఓ కొనల్యకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు 96మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. అయితే అక్కడ కేవలం ఒకే ఒక్క ఉపాధ్యాయుడు ఉండడంతో ఆయనే మధ్యాహ్న భోజనం చూసుకోవడం, ఆఫీసు రికార్డ్స్ పని అంటూ విద్యార్థులకు కనీసం ఒక్క తరగతి కూడా తీసుకోలేక పోతున్నారన్నారు. ఇన్నాళ్లు డీఎస్సీ తరువాత కొత్తగా ఉపాధ్యాయులు వస్తారని మమల్ని మభ్యపెట్టి.. ఇప్పుడు మొండిచెయ్యి చూపడం ఏమిటని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు చొరువ తీసుకొని తరగతికి ఒకరు చొప్పున ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఆదోని రూరల్: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఎంపీడీఓ జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఆదోని మండలంలోని 40 గ్రామ పంచాయతీల్లో 01-04-2024 నుంచి 31-03-2025వ ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ, హౌసింగ్, పంచాయతీ రాజ్, వెటర్నటీ పనులపై సామాజిక తనిఖీ బృందం చేపట్టి వివరాలపై పీడీ ఆరా తీశారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ మాధవీలత, డీవీఓ షకీలాబేగం, అంబుడ్స్‌మెన్ సుధాకర్, ప్రోగ్రామ్ మేనేజర్ మల్లికార్జున, ఏపీడీ లోకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు
97054 44304 (ఆదోని)
70750 09147 (ఎమ్మిగనూరు, మంత్రాలయం)
Office mail : sakshiknladvt@gmail.com

"స్కంధాన్షి" ఆదోని వారి ద్వారా బ్యాంకులు, NBFC ల లోన్లకై సంప్రదించండి.



బ్యాంకులు, NBFC ల TIE UP లతో IFLS వారి సౌజన్యంతో హౌసింగ్ లోన్లు, అపార్ట్మెంట్ లలో ఫ్లాట్ ల కొనుగోలు, మార్ట్‌గేజ్ లోన్లు, క్రొత్త కారు / సెకండ్ హ్యాండ్ కారు కొనుగోలు మరియు తదితర లోన్లు పొందుటకై గైడెన్స్ మరియు సహకారానికై, సరైన పత్రాలతో ప్రక్క అడ్రస్ లో సంప్రదించండి. ▶

ధరణి సునీల్ కుమార్
స్కంధాన్షి ఫైనాన్షియల్ & ఇన్సూరెన్స్ కన్సల్టెంట్స్
పిరమిడ్ ఎదురుగా, అశ్రిత్ అపార్ట్‌మెంట్స్, 4 వ రోడ్డు, యస్.కె.డి. కాలనీ
ఆదోని - 518 301. కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
Cell No: 89 85 00 00 00